# ఏరు దాటి తెప్ప తగలెట్టు

ఆ ప్రాంతాలకి కొత్తవాడైన సుబ్బరాజు గట్టెక్కి చుట్టూ కలయజూశాడు. వంపులు తిరిగి చెరకు తోటల మధ్య నుంచి కోసుకొంటూ, ఉధృతంగా పారుతోంది ఏరు.

గడని పైకి లాగి, పగ్గం తాడుతో బల్లకట్టుని ఒడ్డునున్న రాటకి కట్టి, తనూ పైకి వచ్చాడు నర్సింహులు. బిలబిలమంటూ ఒడ్డునున్న ఒక పది మంది బల్లకట్టు మీదకు వచ్చారు. నర్సింహులు తాపీగా చుట్ట తీసి అంటించి, ఒడ్డున కూర్చున్నాడు.

"నర్సింహులూ! ఆ గట్టుకు తీసుకొని వెళ్ళేది లేదా? అవతల తొందర పన్లున్నాయ్" అని వాళ్ళలో ఒకడైన చంద్రయ్య అన్నాడు.

"పదిమందున్నారు కదా అని మాటిమాటికీ బల్లకట్టు నడుపుతూ కూర్చుంటే, నా నడుం విరగడం తప్ప లాభం లేదు. కనీసం మరో రెండు పుంజీల మనుషులు రాందే బల్లకట్టు కదలదంతే. మీ పన్లకేంలే, ఎప్పుడూ ఉన్నవే!" అన్నాడు నర్సింహులు, పళ్ళ

మధ్య చుట్ట నలుపుతూ.

సుబ్బరాజు వాళ్ళ మాటలని ఆసక్తికరంగా వినసాగాడు.

"మరైతే అట్నుంచి వచ్చింది ఆ అయ్యొక్కడే కదా, ఎందుకు తీసుకొచ్చినట్లు!?" చంద్రయ్య ప్రశ్నించాడు.

"ఏం చెప్పావయ్యా కబురు! ఇది ఉదయం పూట. ఇట్నుంచి అటు పోయే జనం ఎక్కువ. అట్నుంచి జనం కోసం అవతలి గట్టునే కూర్చుంటే, ఇవతలి గట్టున మీరు జాగారం చెయ్యక తప్పదు. అదీకాక మీ రిచ్చే అయిదు పైసలతో అర్ధ రూపాయి అతి కష్టం మీద అవుతుంది. ఆ అయ్యొక్కడూ రూపాయి కాసిచ్చాడు!"

"బావుందిరా నర్సింహులూ వ్యవహారం! దినుసుల బస్తాలకీ, బెల్లం బుట్టలకీ, - అర్ధా, పావలా నెత్తిన కొట్టి మరీ పుచ్చుకొంటున్నావ్! సైకిలుకి పది పైసలు. కూరల తట్టలకీ, పళ్ళ బుట్టలకీ, అరటి గెలలకీ ఇరవై పైసలు చెల్లించుకుంటున్నాం. ఉత్తి మనుషులకి అయిదు పైసలని ఒప్పందం ఉన్నదే. రెండు మూడు రోజుల్లో రెండొందల పళ్ళ బుట్టలు మార్కెట్‌కి పోవాలి. అప్పుడు పుచ్చుకొనే 40 రూపాయలూ నీ కంటికి ఆనవు! ఏదో ఏళ్ళ కొద్దీ ఉన్న వాడివి కదా అని పోటీ లేకుండా పోతూంటే, మహ నీలుగుడుగా ఉంది నీకు! త్వరగా దిగు, అవతల షావుకారుతో బేరం కుదుర్చుకోవాలి. మనకాలశ్యం అయి, ఏలేశ్వరం వాళ్ళు ఆ బేరం కొట్టేస్తే, ఏటికివతల మా నోట్లోనూ మట్టే, మమ్మల్ని నమ్ముకొన్న నీ నోట్లోనూ మట్టే!" చంద్రయ్య కసురుతూ అన్నాడు. ఆ మాటల వెనక దాగిన అభిమానం నర్సింహులుకి తెలిసిందే. మరి మాట్లాడకుండా ఒడ్డు దిగి, రాట నుంచి పగ్గాన్ని తప్పించి, గడతో ఏటికి ఏటవాలుగా బల్లకట్టును తోసుకొంటూ పోయాడు.

ఒంటెద్దు బండి కట్టించుకొని, సిరివాడలో పని చూసుకొని, సుబ్బరాజు తిరిగి వచ్చేసరికి చీకట్లు ముసురుకున్నాయి. గట్టునున్న నాలుగు రాట్ల చిన్న పందిరి కింద, నర్సింహులు వంట వండుకుంటున్నాడు. లాంతరు వెల్తుర్లో సుబ్బరాజుని చూసిన నర్సింహులు, "రండయ్యా రండి. మీకు బాగా పొద్దుపోయిందనుకొంటాను, అన్నం ఉడకేశాను. ఒక్క అయిదు నిమిషాలు ఆగారంటే, మిమ్మల్ని అవతలి గట్టుకు తోసుకు పోతాను. అలా బల్ల మీద కూర్చోండి" అన్నాడు.

"నా గురించి ఆలోచించకు. అవతల రిక్షావాణ్ణి నా కోసం ఆగేటట్లు, బేరం కుదుర్చుకొన్నాను. ఇంతకీ నీకు రోజుకే మాత్రం కిట్టుబాటు అవుతుంది?" సుబ్బరాజు కూర్చుంటూ, నెమ్మదిగా సంభాషణలోకి దిగాడు.

మాటల సందర్భంలో నర్సింహులు చాలా వివరాలు చెప్పాడు.

కనుమల్లో కురిసే వర్షం మూలంగా ఏడాది మొత్తంలోనూ ఏటిలో నీరుండేది రెండు నెలలు మాత్రమే. మనుషుల్ని దాటించి సంపాదించేది రోజు కైదారు రూపాయల కన్నా ఉండదు. ఎటొచ్చీ ఆ రెండు నెలల్లోనూ సరకుల్ని దాటించి, ఒక వెయ్యికి పైగా సంపాదిస్తాడు. నర్సింహులి మొత్తం సంపాదన ఏటి ధర్మమా అంటూ, ఒక పదిహేను

వందల దాకా ఉంటుంది. ఏట్లో నీరు తీసిపోగానే రేవు వదిలి తన గ్రామం పోతాడు. మళ్ళీ వరదలొచ్చే వరకూ, ఏదో కూలీ, నాలీ చేసుకొని కుటుంబాన్ని పోషిస్తాడు. రెండు నెలల కష్టంగా వచ్చిన డబ్బుని--ఏవో శుభకార్యాలకీ, రోగాలకీ, రొచ్చులకీ, ఖర్చుపెట్టగా మిగిలింది ఇంత వెనకేసు కొంటాడు.

వంతెన కోసమని ఆ గ్రామాల ప్రజలు చాలా అర్జీలు పెట్టుకున్నా వాళ్ళ మొర ఆలకించే నాధుడెవరూ లేకపోయారు. ఎలక్షన్ల రోజుల్లో చేసే వాగ్దానాలు అలానే ఉండి పోతున్నాయ్.

"వంతెన కట్టిస్తే, నీ బల్ల కట్టు పనీ, నీ పనీ సున్నాయే కదా?" అన్నాడు సుబ్బరాజు.

"అదేంటి బాబూ, అలాగంటారు? వంతెనొస్తే ఈ గ్రామాలన్నీ బాగు పడతాయి. అవి బాగుపడితే నాకూ చేతి నిండా పనే. నాకొచ్చే పదిహేను వందల కోసం, ఏళ్ళ తరబడి ఈ గ్రామాలన్నీ ఇలానే ఉండి పోవాలంటారా?"

నర్సింహులి సమాధానం విని సుబ్బరాజు చిన్నబోయాడు.

అన్నం ఉడికిన తలవాత, నర్సింహులు సుబ్బరాజుని ఏరు దాటించాడు.

వారం రోజుల తరవాత, 'పర్మిషన్ లేకుండా బల్లకట్టు నడపడం నేరం' అంటూ నర్సింహులికి కలెక్టరాఫీసు నుంచి సమన్లొచ్చాయి.

"మూడు తరాలుగా, ఆ బల్లకట్లుని నమ్ముకుని ఏదో పొట్ట పోసుకుంటున్నాం. నోటి దగ్గర కూడు కొట్టకండి" అంటూ, నర్సింహులు నెత్తీ, నోరూ బాదుకున్నాడు.

"చేసింది నేరమైనా దయదలచి వదిలేస్తున్నాం. ఇకనుంచీ బల్లకట్టు దాటు వోపికుంటే పాట పాడుకుని ప్రభుత్వానికి సొమ్ము చెల్లించు" అని సెక్షన్ ఆఫీసరు గదమాయించాడు.

నర్సింహులు చేసేది లేక ఒప్పుకున్నాడు. కాని పాటలో సుబ్బరాజు నెగ్గాడు. నర్సింహులు తన బల్లకట్టుని అయిదు వందలకి, అతగాడికే అమ్మడం తప్ప మరేమీ చెయ్యలేక పోయాడు.

బల్లకట్టుతో ఏటిని దాటడానికి, సరుకుల్ని దాటించడానికీ, చార్జీలు మూడు నాలుగింతలు పెరిగి పోయాయి. మందకొడి జనం ఏడవడం తప్ప, ఎదురు తిరగ లేకపోయింది. ఆ ఏడే కాదు పై ఏళ్ళలో కూడా నర్సింహులు కాని, మరొకళ్ళు కాని ఆ పాటని నెగ్గలేక పోయారు. ఏటా టంచనుగా పాట పెట్టే ప్రభుత్వం వంతెన కట్టి రోడ్లు వేసి, ఆ గ్రామాలకి మోటారు సౌకర్యాలని కలిగించాలన్న సంగతి మరిచిపోయింది.

ఏటికి వరదొచ్చిన రెండు నెలల్లోనూ నాలుగు డబ్బులు వెనకేసుకునే అవకాశం పోయిన నర్సింహులు, రోజువారీ కూలీగా రెక్కలు ముక్కలు చేసుకుంటూనే ఉన్నాడు.

.........తెప్ప లాంటి నర్సింహులి జీవితాన్ని సుబ్బరాజు తగలెట్టాడు. ●

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక : 11-2-1979)*